


1915 వ సంవత్సరం నవంబరు 17 వ తారీఖున రాత్రి, దయ్యం మాయింట్లో ప్రవేశించినపుడు, దాని అంతు కనుక్కోడానికి నేను నిద్దర పోలేదు. ఆ రాత్రి నేనుచేసిన యిదికి, యిప్పటి వరకూ యిదవుతూనే వున్నాను; ఎందుచేతనంటే, అప్పటి హడావిడిలో మా అమ్మ, ప్రక్కయింటి వాళ్ళ అద్దాల తలుపులగుండా చెప్పులు విసిరింది. మా తాతయ్య పోలీసువాణ్ణొక్కణ్ణి బాకుతో పొడిచేడు; ఇంతగోల జరిగింది ఆ దయ్యం గురించి.

తెల్లవారు ఝామున 2 గంటలకు ప్రారంభమయ్యేయి, మా పడమటింట్లో (భోజనాలగది), గట్టిగా విసురుగా అడుగుల చప్పుళ్లు. మేడమీద గదుల్లో, మా అమ్మా, తమ్ముడు రామం పడుకున్నారు. అటకమీద మంచంలో (యిదివరకు మా నాన్నమీద విరిగిపడిం దనుకున్నది!) మా తాతయ్య. స్నానాలగదిలో స్నానంచేసి, నేను వొళ్లు తుడుచుకుంటున్నాను, అంతలో విన పడింది అడుగుల చప్పుడు. భోజనాలగదిలో, ఎవరో మొగాడు విసురుగా జోళ్ళతో నడుస్తూన్న చప్పుడు. స్నానాల గదిలోవున్న ఎలక్ట్రిక్ దీపం వెల్తురు, భోజనాలగదిలో కొంతవరకూ పడుతూంది. అక్కడ షెల్ఫులో పెట్టిన పింగాణీ ప్లేట్లు, గాజుగ్లాసులూ మాత్రం కనిపిస్తున్నాయి. ఆనడుస్తూన్న మనిషి కనపడటం లేదు.

మా నాన్నా, తమ్ముడు సత్యం బెజవాడ వెళ్లేరు. వాళ్లుగాని, రైలుదిగి వచ్చేరేమో అనుకున్నాను మొదట. ఆ తరవాత, దొంగాడై వుండడుకదా అనిపించింది. చాలాసేపు తరవాత కాని, నాకు అది దయ్యమేమో అని తట్టనేలేదు.

మెల్లిగా అడుగులువేసుకుంటూ, రామం పడుకున్న గది చేరుకున్నాను. 'ఇష్ ?' అన్నాను వాడినిలేపుతూ. ఎవరో పీక నొక్కుతూన్నట్లు 'అఁ! అఁ!' అన్నాడు. ఏదయ్యమో రాత్రి మింగేస్తుందని వాడినమ్మకం. ఫరవాలేదు నేను, అని ధైర్యం చెప్పి, కింద ఎవరో వున్నారని చెప్పేను. ఇద్దరం కలిసి, మెట్లుదిగి, హాల్లోకి కాకుండా పెరటివేపు వెళ్లేం. ఏ అడుగులూ విన పడ్డంలేదు, అంతా నిశ్శబ్దంగావుంది. తువ్వాలు మొలకుచుట్టుకునినించున్న నాకేసి అనుమానంగా చూశాడు రామం. ఇంతలోకే మళ్ళీ ప్రారంభమయ్యేయి అడుగులు. ఇద్దరం మాట్లాడకుండా మెట్లెక్కేసి, పైన నించున్నాం. ఆ అడుగులు కూడా, భోజనాల గదిలోంచి బయటికొచ్చి, మెట్లెక్కుతూన్న చప్పుడయేసరికి, రామం తన గదిలో దూరి తలుపు గడియ పెట్టేసేడు. నేను మెట్లుతలుపులు బిగించేసి, మోకాలడ్డెట్టి తలుపు నొక్కేసేను. అయిదు నిమిషాలు పోయేక, కొంచెం తెరిచి చూసేను. మళ్ళీ అంతా నిశ్శబ్దంగావుంది. మా కెవ్వరికీకూడా మళ్ళీ దయ్యం వినపడలేదు, కనపడలేదు.

మేం తలుపులువేసిన చప్పుడుకి, మా అమ్మ లేచి, 'ఏమిట్రా ఆగోల!' అంది. రామం తన గది లోంచి బయటకొచ్చేడు. 'ఏంలేదు' అన్నాడే కాని, వాడిమొహం తెల్లగావుంది.

'అయితే మెట్లమీంచి, ఆ పరుగులూ, వురుకులూ ఏమిటి? కింద నడుస్తూన్న చప్పుడేమిటి?' అంది. అయితే ఆవిడ కూడా విందన్నమాట! కాని మేం మాట్లాడలేదు. మా యిద్దరి మొహాల కేసీ చూసి, 'దొంగలా ఏమిటి?!' అంది.

ఆవిడని శాంతపరచడానికి, నేను మెట్లుకేసీ నడుస్తూ, 'రా! రామం!' అన్నాను.

'నేను అమ్మదగ్గరుంటాను. నువ్వెళ్లు' అన్నాడు.

‘ఎవరూ కూడా కిందకెళ్ళొద్దు. పోలీసులకి కబురు చేద్దాం’ అంది.

మెట్లుదిగి, హాల్లోకి వెళ్ళిందే, పోలీసులకు కబురు చెయ్యడం మాత్రం ఎట్లా? కాని యిటువంటి సమయాల్లో, మాఅమ్మ తెలివితేటలు అద్భుతం. వెంటనే తన గది కిటికీతలుపులు తెరిచింది. ఒక చెప్పు తీసుకుని, పక్కింటివాళ్ళ అద్దాల కిటికీతలుపు గుండా విసిరేసింది. ఆ గదిలో ఎవరో, రిటైర్డు ఆఫీసరుగారూ, భార్య పడుకున్నారు. పాపం ఆయనకేదో, జబ్బు కూడాను. ఆమాటకొస్తే, మా యిరుగుపొరుగు వాళ్ళందరికీ, ఏదో జబ్బే!

అప్పటికి రాత్రి రెండున్నర గంటలయింది. బయటంతా అంధకారంగావుంది. ఆరిటైర్డ్ ఆఫీసరుగారు తలుపుతీసి, చెయ్యిఆడిస్తూ కోపంతో ఏదో అరుస్తున్నాడు. ‘ఈ యిల్లు అమ్మేసుకుని, మేం కాకినాడ లేచిపోతాం’ అని ఏడుస్తూ అనడం వినిపించింది మాకు, ఆయన పెళ్ళాం.

‘దొంగలు! దొంగలుపడ్డారు మా యింట్లో’ అన్న మాఅమ్మ అరుపులు వాళ్ళకి యిరవై నిమిషాల దాకా అందలేదు. ఆ ఆఫీసరుగారు పోలీసుల్ని పిలవడానికి, కిందకు పోయేడు. వెంటనే, అక్కడున్న రెండోచెప్పు అందుకుంది మాఅమ్మ. ఎందుకని అడిగితే, అద్దాల తలుపులగుండా చెప్పులు విసిరితే, తనకు హుషారుగా వుంటుంది అంది. కాని నేను ఆపుచేసేసే ననుకోండి!

పోలీసులు త్వరగానే వచ్చేసేరు. రెండు గుర్రబ్బళ్ళలో ఎనమండుగురు, సైకిళ్ళమీద యిద్దరు మొత్తం పదిమంది. బాటరీ లైట్లతో గోడలు, మా యింటిముందున్న పూలతోట, వెతికేసి, తలుపు తియ్యమన్నారు. నేను, తియ్యడానికి కిందకు దిగబోతూంటే, అమ్మ వొద్దని జబ్బపుచ్చుకుని ఆపేసింది. ఇంక గత్యంతరంలేక, పోలీసులు, మా వీధి తలుపులు విరగకొట్టేసి లోపల ప్రవేశించేరు. హాలంతా వెతికేరు. భోజనాల గదిలో మూలమూలలూ సెర్చిచేసేసేరు. ఓ పోలీసు, మెట్లకేసి లైటు ఫోకస్ చేసి, నేను పైన తువ్వాలు కట్టుకుని నించోడంచూసి ఏమనుకున్నాడో మరి, గబగబ మెట్లెక్కేసి, నాజబ్బ పుచ్చుకుని,

‘ఏంచేస్తున్నావురా యిక్కడ? ఆఁ....’ అన్నాడు. మాదే యీ యిల్లు అనీదాకా వదలలేదు. నేను నాగదిలోకెళ్ళి, షరాయి తొడుక్కుంటూంటే, ఇంకో పోలీసు, లాఠీతో పక్కల్లో పొడిచి, బేడీలు తగిలించబోయేడు. నే నిక్కడి వాణ్ణే అన్నదాకా వదలలేదు.

ఇనస్పెక్టరు మాఅమ్మకు రిపోర్టు చేసేడు.



'ఎవ్వరూ కనపడలేదు. బహుశా పారిపోయి వుంటారు. వాళ్లని చూసేరా మీరు?'

'ఇద్దరు ముగ్గురున్నారు. పెట్టెలు తెరిచీ, తలుపులుతీసీ, గోలచేసేసేరు!' అంది అమ్మ.

'ఆశ్చర్యంగావుందే! ప్రతితలుపూ కిటికీకూడా, లోపల గడియలేసే వున్నాయి!' అన్నాడు.

పోలీసులు, కిటికీలు తెరిచిచూసేరు. తలుపులు వుతకలెత్తేసేరు. డ్రాయర్లు భోషాణాలు తెరిచేరు. ఇంకొంతమంది పైకివచ్చి మంచాలు లాగేసి, పరుపులెత్తేసి, చిలకకొయ్యనున్న గుడ్డలూడపీకి, యిల్లా నానాహంగామా చేసేసేరు. ఇంతలో ఒక పోలీసుకి, మా రామానికి ఆటల్లో ప్రైజు యిచ్చిన హార్మోనికా కనపడింది.

'ఒరేయి! వెంకటేసూ! యిది చూడు' అంటూ గట్టిగా వాయించడం మొదలెట్టేడు.

ఇనస్పెక్టరుగారు విసుగెత్తిపోయేరు, మిగతా పోలీసులతో అంటున్నాడు. 'యీ అబ్బాయి, యీ పక్క లోంచుకుపోయే చలిలో తువ్వాలుతో వున్నాడు, ఆవిడేమో దయ్యం పట్టినట్లు గోల చేస్తోంది' అని.

ఇంతలో అటకమీదినుంచి, కిర్రు వినిపించింది. మా తాతయ్య పక్కలో దొర్లుతున్నాడు కాబోలు. 'ఏమిటా చప్పుడు?' అన్నారు ఇనస్పెక్టరు. నేను సమాధానం చెప్పడానికి నోరు తెరిచేలోగా, ఆయిదారుగురుపోలీసులు,రివాల్వర్లతో అటకఎక్కేసేరు. అప్పట్లో, తాతయ్య అనుమతి లేకుండా, అటక ఎక్కడం చాలా ప్రమాదం. ఝాన్సీ విజయోత్సవాలయిన తర్వాత, సైనికులంతా విందులలో మునిగివుండగా, బ్రిటిషు సైనికులు హఠాత్తుగా మీదపడడం, భారత యోధులు వికావికలై పోవడం, ఆ సంగతులలో వున్నాడు, తాతయ్య ఆయిదారురోజులునుంచి-నేనుకూడా అటకఎక్కేటప్పటికి అంతా గందరగోళంగావుంది. హఠాత్తుగా వచ్చిన పోలీసుల్ని చూసి, మీదపడ్డ బ్రిటిషు సైనికులనుకున్నాడు తాతయ్య. వెంటనే తలకట్టగోడను వేలాడుతూన్న బాకు లాగి, ఒకణ్ణి పొడిచేసేడు. ఇంతలో మిగతావాళ్లు బేడీలు తగిలించేసేరు.

కిందకు తీసుకొచ్చేక, పోలీసులకు చెప్పేను. ఆయన మాతాతయ్య అనీ, మిమ్మల్ని చూసి ఎవరో అనుకున్నాడనీ, ఆ సంగతంతా చెప్పేను. ఇనస్పెక్టరు వొదిలిపెట్టేడు తాతయ్యను, బాకుపోటు తిన్న పోలీసుకి పదిరూపాయలు యిచ్చిన తర్వాత.

చివరికి పోలీసులు దొంగల్ని పట్టుకోలేకపోయేరు. వాళ్ళ అపజయం అంగీకరించడానికిష్టంలేక, మళ్లీ సెర్చి మొదలెట్టేరు. ఇంతలో ఎక్కడినుంచి వచ్చేడో, పత్రికా రిపోర్టరొచ్చి, నాకేసి ఎగాదిగా అనుమానంగా చూసి,

'అసలిక్కడ జరిగిన సంగతేమి టబ్బాయ్!' అన్నాడు. నేను చెప్పేను దయ్యాలొచ్చేయని. బరువు తూచే మిషన్లో అణా పడేసి, అది కదలకపోతే వానికేసి చూసే చూపుతో నన్ను చూసి, వెళ్ళిపోయేడు రిపోర్టరు. వాడివెనకాలే, అంతా జారుకున్నారు. చేతిలో బాకు గుచ్చుకున్న పోలీసుని చూపెట్టి, ఎవరు పొడిచేరని అడిగింది అమ్మ.

'తాతయ్య పొడిచేడు.'

'ఎందుకూ?'

'వాడు బ్రిటిష్ సైనికుడు' అన్నాను.

'వాడా! అంత చక్కగా వున్నాడు. వాడు తెల్లాడేమిటిరా నీ బొంద!' అంది.

పొద్దుటే కాఫీదగ్గర, తాతయ్య చాలా హుషారుగా కనిపించేడు. బహుశా రాత్రి సంగతి మరిచిపోయేడేమో అనుకున్నాం. రెండో పెద్ద గ్లాసు కాఫీ పూర్తిచేసేక నాకేసీ, రామంకేసీ గుడ్లెర్రచేసి చూసి-

'రాత్రి, యిల్లంతా పీకి పందిరేసిన ఆ పోలీసుల వుద్దేశం ఏమిటిరా!' అని గర్జించేడు. చచ్చేం! అయితే, వాళ్లు తెల్లసైనికులు కాదన్నమాట.

సొగసులేని మనిషే వుండడు. స్నేహమూ, ప్రేమా అనే అనాది అయిన్నీ యెప్పటికీ సరికొత్తగా ఉండే రెండు వెలుగులను నరులమీదకాంచి తిప్పి కాంచితే వింతవింత సొగసులు బయలుదేరుతవి. అసూయ అనే అంధకారంలో అంతా యేక నలుపే!—గురజాడ అప్పారావు